www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 18 ఆగస్టు 2025

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

పింఛా జలాశయానికి జలకళ

0.320 పూర్తి స్థాయిలో నిల్వ
3,770 ఎకరాలకు నీటి లభ్యత
నేడు గేట్లు ఎత్తివేత

జలకళ సంతరించుకున్న పింఛా ప్రాజెక్టు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పింఛా జలాశయం పూర్తిస్థాయి జలకళను సంతరించుకుంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ధాటికి పింఛా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 0.327 ఎంసిఎఫ్‌టి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా 0.320 ఎంసిఎఫ్‌టి నిల్వకు చేరుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులోభాగంగా రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు సి.జగన్‌మోహన్‌రాజు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ సమక్షంలో గేట్ల ఎత్తివేతకు సిద్ధమైంది. పింఛా జలాశయం పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకోవడంతో సుండుపల్లి మండల పరిధిలో 3,770 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుంది. దీనికితోడు మరో ఎనిమిది చెరువులకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుంది. 2020 నవంబర్ 19న సంభవించిన జవాద్ తుఫాన్ ధాటికి పింఛా రిజర్వాయర్ మట్టికట్టలు తెగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం జిల్లా నీటిపారుదలశాఖ రూ.62 కోట్లతో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులకు ప్రతిపానదనలు పంపించింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదలనలకు ఆమోదం తెలిపింది. ఈమేరకు అన్నమయ్య జిల్లా నీటి పారుదలశాఖ మట్టికట్టల పునరుద్ధరణ పనులను చేపట్టింది. మూడేళ్ల వ్యవధిలో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసింది. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో 2024లో ఫెంగల్ తుపాన్ ధాటికి పింఛా జలాశయం నిండిన సంగతి తెలిసిందే. తాజాగా రెండవ ఏడాది ఉపరితల ఆవర్తనం ధాటికి పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంది. ఈనేపథ్యంలో అన్నమయ్య జిల్లా ఇంజినీరింగ్ యంత్రాంగం గేట్ల ఎత్తివేసి దిగువ భాగానికి నీటిని విడుదల చేయనున్నారు. దీంతో బాహుదా నది జల పరవళ్లతో తెగిన అన్నమయ్య రిజర్వాయర్ మీదుగా సోమశిల వెనుకజలాల్లో కలవనుంది.

గుంతలు లేని రహదారులు ఏర్పాటు

ఆర్అండ్‌బి ఎస్ఇ వై.సహదేవరెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో అందరికీ అందుబాటులో ఉండి గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్అండ్‌బి ఎస్ఇ వై. సహదేవరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాలు,30 మండలాలున్నాయి. జిల్లాలో రహదారులలో గుంతలను ఆరు నియోజకవర్గాల ప్రజా ప్రతినిధుల సహకారంతో 187 గుర్తించి, వాటా అంచనా రూ. 15.91.00 లక్షలతో నిర్మాణం పనులు పూర్తి చేశారు. ఆర్అండ్‌బి కార్యాలయాలు, సిబ్బంది వివరాలు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బి కార్యాలయాల వివరాలు తెలియ జేయండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బి కార్యాలయం రాజంపేట, మదనపల్లిలో రెండు ఇ.ఇ కార్యాలయాలు, రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి, మదనపల్లి , పీలేరు లో 5 డిఇఇ. కార్యాలయాలు, రాజంపేట, నందలూరు, టి. సుండుపల్లి, కోడూరు, చిట్వేల్, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లి (తూర్పు), మదనపల్లి (పడమర), తంబళ్లపల్లి, బి. కొత్తకోట, పీలేరు, కలికిరి , వాయల్పాడులలో 14 ఎఇఇ కార్యాలయాలున్నాయి.

జిల్లా వ్యాప్తంగా రోడ్లు విస్తీర్ణం ఎంత ?

అన్నమయ్య జిల్లాలో రాష్ట్ర రహదారులు 595.00 కి.మీ, జిల్లా ప్రధాన రహదారులు 2,127.00 కి.మీ. మొత్తం 2,721.00 కి.మీ రహదారులు న్నాయి.

గుంతలు లేని రహదారుల పనులు వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా187 రహదారి పనులను రూ .1591.00 లక్షతో పూర్తి చేశాం.

మున్సిపల్ రహదారుల పనులు తెలపండి?

జిల్లా కేంద్రం రాయచోటిలో రింగ్ రోడ్డు మరమ్మతులకు కోసం రూ. 450.00 లక్షలు మంజూర య్యాయి. భూ సేకరణ పనులు పురోగతిలో ఉన్నాయి. భూసేకరణ అయిన వెంటనే మరమ్మతుల పనులు ప్రారంబించడానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో అన్ని చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

జిల్లా కేంద్రంలో రింగ్ రోడ్డు పెండింగ్ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు?

జిల్లా కేంద్రంలోని రాయచోటి రింగ్‌రోడ్డు 2009వ సంవత్సరంలో మంజూరైంది. రాయచోటి రింగ్ రోడ్ నిర్మాణ పనులు కూడా దాదాపు అంతా పూర్తయింది. మదనపల్లి రింగ్ రోడ్ సర్కిల్, చెన్న ముక్కపల్లె వద్ద కొంత నిర్మాణ పనులు పెండింగ్‌లలో ఉన్నాయి.అక్కడ కొందరు బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఆ సమస్యలు పరిష్కారం అయిన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం

నా బార్డ్ కింద పనులు ఏమైనా మంజూరయ్యాయా?

జిల్లా వ్యాప్తంగా రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, మదనపల్లి ప్రాంతాలలో నాబార్డ్ నిధులు కింద ప్రతి పాదనలను పంపాం. పనులు మంజూరు కాగానే టెండర్లను పిలిచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

రాజంపేట, నందలూరు, కోడూరు, చిట్వేల్, రాయచోటి, మదనపల్లి (పడమర), తంబళ్లపల్లి, బి.కొత్తకోట, పీలేరు, కలికిరి, వాయల్పాడులో ఎఇఇల కొరత ఉంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే విధులు నిర్వహించుకుంటున్నాం.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

వాటర్ స్కీమ్ బోర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

ప్రజాశక్తి-రామాపురం

మారుమూల గ్రామాలలో సైతం మౌలిక సదుపాయాలు, తాగునీటి సమస్య పరిష్కరించడమే తమ లక్ష్యమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు మండలంలోని హసనాపురం పంచాయతీలో ఎర్రింగివాండ్లపల్లి దళితవాడ, పెడబల్లివాళ్ళపల్లి గ్రామాలలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పెడబల్లివాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో పూజ నిర్వహించి గ్రామానికి తాగునీటిసమస్య పరిష్కారం కోసం వేసిన వాటర్ స్కీం బోర్‌ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలను పరామర్శించారు. అనంతరం ఎర్రింగి వాండ్లపల్లి దళితవాడలో దళితులు గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. గ్రామంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్య సిమెంట్ రోడ్లు త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి నాగ సుబ్బారెడ్డి, పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, పెంచల్ రెడ్డి, శివారెడ్డి, అల్లాబకాష్, పక్కిరరెడ్డి గంగిరెడ్డి పాల్గొన్నారు

కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమానికి పెద్దపీట

చిన్నమండెం : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తన స్వగ్రామం బోరెడ్డిగారిపల్లిలో ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధికి అడ్డులేదు సంక్షేమానికి తిరుగులేదని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఎన్నో పథకాలను అందించడం జరుగుతుందని, ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంతమంది అధికారులు, నేతలు, ప్రజలు మంత్రికి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

బస్సుల సామర్థ్యం పెంచాలి

- ఆర్‌టిసి ఇడి చెంగల్‌రెడ్డి

బస్సులో మహిళ ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్‌టిసి ఇడి చెంగల్ రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ప్రయాణికులకు సౌకర్యంగా బస్సుల సామర్థ్యం పెంచినప్పుడే స్త్రీశక్తి పథకం విజయవంతం అవుతుందని అందుకు అందరూ కృషి చేయాలని ఆర్‌టిసి ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పీలేరు ఆర్‌టిసి డిపోను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇడి కార్మికులతో మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్రంలో 8,400 బస్సులను నడుపుతున్నామని, జీరో టిక్కెట్టుతో మహిళలు ప్రయాణిస్తున్నందున ఆవిలువ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఆర్‌టిసికి చెల్లిస్తుందని అన్నారు. ప్రయాణీకుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఎక్కువ మంది మహిళలు స్త్రీశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత కండక్టర్లు, డ్రైవర్లదేనని చెప్పారు. సిఎం చంద్రబాబు స్త్రీశక్తి పథకం నిర్వహణపై సమీక్షిస్తున్నందున ఉద్యోగులు అప్రమత్తంగా విదులు నిర్వహించాలని సూచించారు. ప్రతినెల 1,2,3 తేదీల్లో బస్సులను డ్రైవర్లు, ఉద్యోగులు తనిఖీ చేసి సమస్యలను మెకానిక్ లకు తెలిపితే 5,6,7 తేదీల్లో వాటినకి మరమ్మతులు చేస్తారని ఇప్పుడు కెఎంపిఎల్ ప్రధానం కాదని ప్రయాణికులు ఇబ్బంది పడకుండా బస్సులను కండీషన్‌లో నడపడమే ధ్యేయంగా అందరూ పనిచేయాలని సూచించారు. బస్సుల మరమ్మతులకు అవసరమైన విడిభాగాలు కూడా అవసరాల మేరకు సరఫరా చేస్తామని అదనపు బస్సులకు ఆన్ కాల్ డ్రైవర్లను తీసుకుని వారికి రోజుకు రూ.1000 వేతనంగా చెల్లిస్తామన్నారు. బస్సులను కండీషన్‌లో ఉంచుతామని కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌టిసి బస్టాండులో రూ. 45 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఆర్‌టిసి బస్సులు ఎక్కి మహిళా ప్రయాణికులతో స్త్రీ శక్తి పథకంపై మహిళల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇడిని ఆర్‌టిసి డిఎం నిర్మల, ఎంఎస్ హరినాథ్, సిఐ ధనంజయులు,బిఎస్ఎంలు బాబునాయక్, రెడ్డప్ప, ఆర్‌టిసి ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఇడి డ్రైవర్, కండక్టర్‌ను సన్మానించారు.

జిఒ137ను రద్దు చేయాలి

ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జి.వి.నరసయ్య

ఆర్‌టిసి స్థలాన్ని లులు షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెంబర్ 137ను రద్దు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి.నరసయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రాజంపేట ఆర్‌టిసి డిపోలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఎపిఎస్ఆర్‌టిసి గవర్నర్ పేట-1, 2 డిపోలు పాత బస్టాండుకు సంబంధించిన సుమారు రూ.400 కోట్ల విలువ చేసే 4.15 ఎకరాల స్థలం రాష్ట్ర ప్రభుత్వం షాపింగ్ మాల్ కు కట్టబెట్టి కొన్ని దశాబ్దాలుగా ప్రజలకు రవాణా సౌకర్యాలు అందిస్తూ అందుబాటులో ఉన్న రెండు డిపోలలోని 200 బస్సులను, 1100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేస్తూ బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టేందుకు నిర్మించిన జీవో నెంబర్ 137ను వెంటనే రద్దు చేయాలని కోరారు. గవర్నర్ పేట డిపోలకు సంబంధించిన పాత బస్టాండ్ స్థలాన్ని 1959లో అప్పటి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గజం ధర రూ 16 లతో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిందని, ఆ స్థలాన్ని ఇప్పటి ప్రభుత్వ పెద్దలు ప్రైవేటు వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేసేందుకు తీసుకున్న నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా లులు షాపింగ్ మాల్‌ను నగర శివారు ప్రాంతాలలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, అలా కాకుండా నగర నడిబొడ్డున ఉన్న నిరంతరం రద్దీగా ఉంటూ ప్రజలకు అందుబాటులో పాత బస్టాండుకు అనుబంధంగా ఉన్న డిపోలలోని బస్సుల్లో ప్రయా ణించే ప్రయాణికుల సంఖ్య మహిళలకు ఏర్పాటుచేసిన ఉచిత బస్సు పథకం అమలుతో ఆ సంఖ్య రెట్టింపు అవుతుందని, ఇటువంటి తరుణ ంలో ఈ డిపోలను అక్కడ నుండి తొలగించడం పట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఆర్టిసి శిక్షణ కళాశాల స్థలం 29 ఎకరాలను హెచ్‌ఇఎల్ కంపెనీకి కట్టబెట్టారని, అందుకు ప్రతిగా ప్రభుత్వం ఇస్తామన్న స్థలం ఇప్పటివరకు ఒక గజం కూడా ఇవ్వలేదని అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రయివేట్ ఆపరేటర్లకు కట్టబెట్టకుండా ఆర్‌టిసి సిబ్బందినే వినియోగించుకోవాలని, ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకుని ఆర్టీసీ ద్వారానే ఎలక్ట్రిక్ బస్సులు నడిపేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆర్టీసీ ఆస్తులు, హక్కులు కాపాడుకునేందుకు ఆర్టీసీలోని అన్ని సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వి రమణ, ఇయు నాయకులు ఎం. చలపతి, ఆర్.వి.బిరాజు, జె.బాలాజీ, సి.హెచ్‌కృష్ణ, ఎస్‌కె.వల్లి, కె.రహమతుల్లా, పి.బాబు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువపై వంతెన నిర్మించాలి

-నల్లగుట్టపల్లె గ్రామస్తుల నిరసన

కాలువపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హంద్రీ-నీవా కాలువపై వంతెనిర్మించి తమను ఆదుకోవాలని మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామస్తులు ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి, వ్యవసాయ పొలాలకు మధ్యన హంద్రీ-నీవా కాలువ ఉందని, ప్రస్తుతం కాలువ నిర్మాణం పూర్తి చేసి నీళ్లు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారని అన్నారు. తమ పొలాలకు వెళ్లేందుకు దారి ఉండదని, తమ పొలాలకు వెళ్లేందుకు వంతెన ఏర్పాటు చేసిన అనంతరం కాలువ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. గతంలో కాలువ నిర్మాణం చేసిన సమయంలో తమ పొలాలకు వెళ్లేందుకు సొంతంగా మట్టితోలి కాలువ గుండా మట్టి రోడ్డును ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. అప్పటి నుంచి వంతెన ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారే తప్ప నిర్మించలేదన్నారు. ఈ సమస్యను కలెక్టర్, సబ్ కలెక్టర్, సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఒకవేళ కాలువలో నీరు వదిలితే ఆ నీటిలో పాడిఆవులు, రైతులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. నీటి ప్రవాహం ఎక్కువైతే కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే ఆవులు, ప్రజలు రాకపోకలు సాగించడానికి సౌకర్యం కల్పించిన తరువాత నే నీటిని వదలాలని స్పష్టం చేశారు. ఇప్పటికే కాలువగుండా ప్రయాణించే సమయంలో పలుమార్లు మహిళలు పడి గాయాల పాలైన సంఘటనలు అనేకమన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని హంద్రీ-నీవా అధికారులు వంతెన నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

కేక్ కట్ చేస్తున్న వీసీకే, బాస్ నేతలు

రాజకీయ ఉద్యమానికి ఊతం 'తిరుమావళవన్'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విసికె పార్టీ జాతీయ అధ్యక్షుడు, చిదంబరం లోక్‌సభ సభ్యుడు డాక్టర్ తొల్ తిరుమావళవన్ 63వ జన్మదినాన్ని లౌకిక పరిరక్షణ దినంగా నిర్వహించారు. ఆదివారం మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో విసికె పార్టీ భారతీయ అంబేద్కర్ సేన (బాస్) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. విసికె పార్టీ స్టేట్ మీడియా సెక్రటరీ టి.ఎ. పీర్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ లౌకిక పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, డాక్టర్ తిరుమావళవన్ జన్మదినాన్ని "లౌకిక పరిరక్షణ దినం"గా నిర్వహిస్తున్నామని తెలిపారు. తమిళనాడు రాష్ట్రం, తిరుచ్చి సమీపంలోని అంగళూరులో జన్మించిన తిరుమావళవన్ ఉన్నత విద్యను అభ్యసించి, ఫోరెన్సిక్ డిపార్ట్మెంట్‌లో సైంటిస్ట్‌గా ఉద్యోగం చేశారని, దళిత పాంథెర్స్ నేత మలైస్వామి హత్య తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి, ఉద్యమ నాయకత్వం చేపట్టారన్నారు. సామాజిక ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా మలుపుతిప్పి, తమిళనాడు రాజకీయాల్లో విసికె పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేశారని చెప్పారు. కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు యు. గణపతి, విసికె రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, రాష్ట్ర కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు, బాస్ రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, కోశాధికారి నీరుగట్టి రమణ, పెద్ద సంఖ్యలో విసికె, బాస్ నాయకులు పాల్గొన్నారు.

యానాది కులాన్ని గిరి బలిజలో చేరిస్తే సహించం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యానాది కులాన్ని గిరి బలిజలుగా మార్పు చేస్తూ ప్రభుత్వం వెలువరచిన ఉత్తర్వులు వెనక్కు తీసుకోవాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్, రాష్ట్ర కాపునాడు సంయుక్తంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి శేఖర్ మాట్లాడుతూ ఘనమైన చరిత్ర కలిగిన బలిజలపై పాలకులు చిన్నచూపు చూడటం తగదన్నారు. ఒక కులాన్ని మరొక కులంలో చేర్చే ముందు కుల పెద్దలను, కుల సంఘం నాయకులను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడం సహేతుకం కాదన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించిన బలిజలపై చిన్న చూపు చూస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఇప్పటికైనా బలిజల్లో మరొక కులాన్ని కలిపే ఆలోచన మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షులు ఆంజనేయ కుమార్, శ్రీకృష్ణదేవరాయ విగ్రహదాత కాల్వపల్లి కృష్ణమూర్తి, ఆర్‌పిశ్రీఫ్‌మహిళా నాయకురాలు శ్యామల, పుంగనూరు బలిజ నాయకులు రాఘవ, నియోజకవర్గ కన్వీనర్ అడ్వకేట్ కిషోర్, జనార్ధన్‌రాయల్, బి.సుబ్రహ్మణ్యం, శిల్పసాగర్, విశ్వనాథ్, మంజునాథ రాయల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

బ్రౌన్ గ్రంథాలయానికి బీరువా, పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

తప్పెట్ల కొత్తపల్లికి చెందిన మల్లిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెన్నా సిమెంట్స్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ మల్లిరెడ్డి సుబ్బారెడ్డి ఆదివారం బీరువాను, వంద పుస్తకాలను సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణకు అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన విలువైన గ్రంథాల్లో విష్ణు పురాణం, వామన పురాణం, శ్రీమద్భాగవతం (వ్యాసుడు), ఆంధ్ర మహాభారతం, పోతన భాగవతం, శివరాత్రి మాహాత్మ్యం, శ్రీమద్భగవద్గీత, ఆంధ్రవాల్మీకి రామాయణం, కాళికాంబా సప్తశతి, కాళీమకుట కందములు, శ్రీమదాంధ్రాభ్యుదయం, ఉష్యశ్రీ రామా యణం, గీతామకరందం, శ్రీశైల చరిత్ర లాంటివి ఉన్నాయన్నారు.

రాత పరీక్ష పోటీ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సొసైటీ సభ్యులు

నగరంలోని అప్సర్ కాలనీలో ఉన్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మొహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్ర పై రాత పరీక్ష పోటీలు నిర్వహిస్తున్నామని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్.ఎం. ముక్తార్ అహ్మద్ తెలిపారు. ఆదివారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి తమ సొసైటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర పై రాత పరీక్ష పోటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 21న ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు భాషలలో రాత పరీక్ష పోటీలు నిర్వహించబోతున్నామని చెప్పారు. . కులమతాలకు అతీతంగా విద్యార్థులు హాజరుకావాలని కోరారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు, హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్, బాబు భాయ్ పాల్గొన్నారు.

గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీ జానకిపురంలో ఆదివారం శ్రీ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఆహ్వానం మేరకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై హాజరై గ్రామ ప్రజలతో కలిసి వేద పండితులు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు సంపూర్ణ సౌభాగ్యవతి,కుటమి నాయుకులు, గ్రామ పెద్దలు పాల్కొన్నారు.

పంతగాని ప్రసాద్‌కు కేకుతినిపిస్తున్న కెకె చౌదరి, టిడిపి నాయకులు

ఘనంగా 'పంతగాని' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర్వామి ఆలయం వద్ద పంతగాని అభిమానులు గజమాలతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అక్కడ నుంచి అభిమానులతో కలిసి పంతగాని ర్యాలీగా రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్దకు వెళ్లారు.రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కెకె.చౌదరి, పంతగానికి కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అభిమానులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లారీ సుబ్బరాయుడు, మందపాటి శంకరయ్య, దినేష్ చౌదరి, రమణ రాజు, లాయర్ బాలాజీ, రామాంజులు నాయుడు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

హిందీ ప్రచార సభ హైదరాబాద్ వారు నిర్వహించే ప్రథమ, మధ్యమ, ఉత్తమ, విశారత్, భూషణ్ విద్వాన్ పరీక్షలకు ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ పరీక్షలు సెప్టెంబర్ 13, 14వ తేదీలలో మండల కేంద్రంలోని ఎస్‌బివివిడి సభ పాఠశాలలో జరుగుతాయన్నారు. ఈ పరీక్షలు ఉత్తీర్ణులైన విద్యార్థులు హిందీ పండిట్ ట్రైనింగ్ చేయడానికి, డిఎస్‌సి రాయడానికి అర్హులవుతారని తెలిపారు. పూర్తి వివరములకు 630 3701314 నంబర్ కు సంప్రదించాలని తెలిపారు.

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శులు ఎంపిక

ప్రజాశక్తి- కలకడ

రవికుమార్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శులుగా బరకం రవికుమార్‌రెడ్డి, జల్లా రాజగోపాల్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ సిఎం వై.ఎస్.జగన్ ఆదేశానుసారం రాష్ట్ర కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పదవులకు ఎంపికకు సహకరించిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. మాపై ఉంచిన ఈ పదవికి న్యాయం చేకూరేలా ప్రజలకు అందుబాటులో ఉండి పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. వీరి ఎంపిక పట్ల మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడి రాజీనామా

ప్రజాశక్తి-మదనపల్లె

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా 2023 సంవత్సరం నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ పి.ద్వారకనాథరెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తన వయస్సు కారణంగా సంఘం కార్యకలాపాలలో సక్రియంగా పాల్గొనడం సాధ్యం కావడం లేదు. సంఘం కోశాధికారి ఎ.అంకిరెడ్డి అకాల మరణం చెంద డం దురదృష్టకరమన్నారు. ఈ పరిస్థితుల్లో నేను అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నాను. కోశాధికారి లేని పరిస్థితిలో ప్రస్తుత కమిటీని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో కొత్త కమిటీ ఏర్పాటుకు నా సహకారం అందిస్తానని చెప్పారు.

బుగ్గవంక పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో బుగ్గవంక పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన బుగ్గ వంక డ్యామ్‌ను పరిశీలించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని ప్రస్తుతం డ్యామ్ లో ఎన్ని క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయని అక్కడి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి కడపలో కురుస్తున్న వర్షాల కారణంగా బుగ్గ వంక డ్యాం వల్ల గత అనుభవాలను, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకొని ప్రమాదాలను అరికట్టాలని జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. కడపలో వర్షం పడితే బుగ్గ వంక పరివాహక ప్రాంత ప్రజలు ఆనాటి చీకటి రోజులు గుర్తుకు వస్తాయని తెలిపారు. గత సంఘటనలు దృష్టిలో పెట్టుకుని భయభ్రాంతులు అవుతున్నారని చెప్పారు. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అనాథ వృద్ధులకు అన్నదానం సంతోషకరం

ప్రజాశక్తి - వేంపల్లె

వృద్ధాశ్రమంలో ఉన్న అనాథ వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్త రవికుమార్‌కు కవల పిల్లలైన కేతన్, కేతన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్థానిక గండి రోడ్డులో ఉన్న మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా తులసిరెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవసేవ, ప్రార్థించే పెదవుల కన్నా.. సేవ చేసే చేతులు మిన్న అని మదర్‌థెరిస్సా చెప్పారన్నారు. అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులు విజయమోహన్‌రెడ్డి, ఆల్ఫాన్స్‌రెడ్డి, చిన్నప్పరెడ్డి ఆశ్రమం పెట్టి చాలా ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, హన్సికారెడ్డి, నాగరాజు, వినయ్, రవికుమార్, కేతన, కేతన్, విజయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కోళ్లబైలు పంచాయితీ అమ్మచెరువు మిట్ట, వెలుగు స్కూల్ వెనుక చేపడుతున్న కొన్ని అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కొంతమంది లబ్ధిదారులు తమకు 2008లో ఇంటి పట్టాలు ఇచ్చారని చెప్పడంతో వాటిని తీసుకుని తాహశీల్దార్ కార్యాలయానికి రావాలని తాహశీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నేప థ్యంలో లబ్ధిదారులు ఆదివారం కార్యాలయానికి చేరుకునితమకు మంజూ రు చేసిన ఇంటిపట్టాలను తాహశీల్దార్‌కు చూపించారు. ఈ మేరకు ఆయన విచా రణ నిర్వహించారు. పట్టాలను పునః పరిశీలిస్తామని, తదుపరి ఆదేశాలిచ్చే వరకు నిర్మాణాలు చేపట్టవద్దని లబ్దిదారులకు సూచించారు. ఈ సంద ర్భంగా బాధిత లబ్ధిదారులు మాట్లాడుతూ పేదలూ ఉన్న తమను 2008లో రెవెన్యూ అధికారులు గుర్తించి ఇంటిపట్టాలను మంజూరు చేశారన్నారు. తమ కు కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు చేసుకోవడానికి అనువుగా లేక పోవడం, పెద్దపెద్ద బండరాళ్లు ఉన్న కారణంతో, ఆర్థిక పరిస్థితి అంతంత

తహశీల్దారు కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు

మాత్రంగానే ఉండడంతో దశల వారీగా చదును చేసుకున్నామని, ఇళ్లు నిర్మించుకోవడానికి అనువుగా ఉండడంతో పనులు చేసుకుంటు న్నామన్నారు.

నాణ్యమైన విద్యాబోధన, అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకూ ప్రోత్సాహం

ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నాణ్యమైన విద్యాబోధన ,అత్యుత్తమ ఫలితాలకు, క్రమశిక్షణకు కేరాఫ్‌గా పట్టణంలోని రంగస ముద్రం రోడ్డు నందు గల ఆదిత్య డిగ్రీ కళాశాల నిలుస్తోందని కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడే కోర్సులు తమ కళాశాలలో అందు బాటులో ఉన్నాయన్నారు. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ గుర్తింపు, అనుభవం కలిగిన అధ్యాపకులచే బోధన, అధునా తనమైన ల్యాబ్ సౌకర్యం మా కళాశాల ప్రత్యేకత అన్నారు. ముఖ్యంగా తమ కళాశాలలో బిసిఎ డేటా సైన్స్, బిసిఎ జనరల్, బిసిఎ ఆర్టిఫికల్ ఇంటెలిజెన్స్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి బయో టెక్నాలజీ, బికాం. కంప్యూటర్ అప్లికేషన్, గ్రూపులో అందుబాటులో

ఉన్నాయన్నారు. ఈ గ్రూపులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రతి సెమిస్టరులో ప్రతి గ్రూపులో విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. తమ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు, తల్లిద ండ్రులు వారి పిల్లలను తమ కళాశాలలో చేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8309995387, 9966655167,08582-294123 అనే నెంబర్లను సంప్రదించాలని కోరారు. అడ్మిషన్లు ప్రారంభమైనవని తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని సాయి శ్రీ ఎడ్యుకేషనల్ సెంటర్‌లో 1993-1994 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు కుటుంబ సమేతంగా ఆదివారం ప్రముఖ పర్యాటక కేంద్రం హర్సిలీహిల్స్ లో అపూర్వ కలయిక కార్యక్రమం ఏర్పాటు చేశారు.అనంతరం ఒకచోట చేరి తాము చదివిన విషయాలను నెమరు వేసుకున్నట్లు తెలిపారు. 10వ తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివి ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగి వివిధ ఉద్యోగాలు,వివిధ రకాల సంస్థల్లో పనిచేస్తున్న వారు మొత్తం ఒకే వేదికపైకి చేరి తాము గతంలో చదివిన రోజులలో చేసిన అల్లర్లు నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ,క్రమశిక్షణను అలవాటు చేసుకుని పెద్దలను గౌరవించడం, మర్యాదగా పలకరించడం వంటి విషయాలను నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో వారిని ఘనంగా సత్కరించారు. విద్యార్థుల అపూర్వ కలయికలో గురువులు మురళి, గౌస్ పీర్, రంగారెడ్డి, అన్వర్, శేఖర్, హరినాథ్, ఇనాయతుల్లా, సుబ్బారెడ్డి, పూర్వ విద్యార్థులు కే.ఖాదర్ వల్లి, నిజాం బేగ్, కాచిపల్లి శంకర్ రెడ్డి, బొమ్మసాని రాజా, మేడా రఘు, మురళి, జిన్నా, నగేష్ పాల్గొన్నారు.

యువత సమాజానికి ఆదర్శంగా ఉండాలి

-పలువురు యువకులపై కేసు నమోదు

-పీలేరు అర్బన్ సిఐ యుగంధర్

ప్రజాశక్తి-పీలేరు

యువత స్నేహపూర్వకంగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా ఉండాలని, అసాంఘిక కార్య క్రమాలకు దూరంగా ఉండాలని పీలేరు అర్బన్ సిఐ యుగంధర్ తెలిపారు. ఆదివారం పీలేరు సిఐ కార్యాలయంలో ఆయన మీడియా సమావే శాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్ల లపై ప్రత్యేక దృష్టి పెట్టి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కొందరు యువకులు తమ ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తొలగించి, అధికంగా శబ్దాలు చేస్తూ ప్రధాన రహదారుల వెంట తిరుగుతూ ఇతరులను ఇబ్బంది పెడుతున్నారని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. అలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో పలువురు యువకులపై న్యూసెన్సు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని

మాట్లాడుతున్న పీలేరు అర్బన్ సిఐ యుగంధర్

కడప రోడ్డులో వినాయక చవితి సందర్భంగా ఉత్సవ విగ్రహం ఏర్పాటు కేంద్రం వద్ద లోగో ఆవిష్కరించి, గ్యాస్ యంత్రం సాయం తో ప్లాస్టిక్ పూలు రోడ్డుపై వెదజల్లుతూ ప్రజలను భయ ంభ్రాంతులకు గురి చేశారని అన్నారు. ఈ కేసులో రమేష్ నాయక్, సన్నీ, నితీష్, వారి అనుచరులపై కేసు నమోదు చేశామని చెప్పారు. స్థానిక చెన్నారెడ్డికాలనీలో మరి కొంత మంది యువకులు ఒక వివాహిత మహిళపై దౌర్జన్యానికి పాల్పడిన సంఘటనలో అన్వేష్ రెడ్డి, శ్రావణ్, షబ్బీర్, శ్యాం, మహేంద్ర వారి అనుచరులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. యువకులు ఎవరు ఈ తరహా చర్యలకు పాల్పడవద్దని, అలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హెల్మెట్ లేకపోతే జరిమానా తప్పదు :సిఐ

వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ రాఘవరెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే జరిమాన తప్పదని వాల్మీకిపురం సిఐ రాఘవ రెడ్డి అన్నారు. ఆదివారం మదనపల్లె - తిరుపతి జాతీయ రహదరిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్‌లు, లైసెన్స్‌లు, వాహన రికార్డులు లేని వారికి జరిమాన విధించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లేని పక్షంలో వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. హెల్మెట్ ధరించి ఉన్నప్పుడు ప్రమాదం జరిగినా ప్రాణాపాయస్థితి నుంచి సురక్షితంగా బయటపడవచ్చునన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తమ వెనుక ఒక కుటుంబం తమపై ఆధారపడివుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ద్విచక్రవాహనాల్లో ఇద్దరు మాత్రమే వెళ్లాలని, ముగ్గురు, నలుగురు వెళ్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ద్విచక్రవాహనంలో వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సురక్షితంగా బయటపడవచ్చునన్నారు. ముఖ్యంగా యువత వివిధ రకాల వాహనాలతో కేరింతలు కొడుతూ ప్రమాదాలకు గురవుతుంటారని, హెల్మెట్ ధరించడం వలన ప్రాణరక్షణ ఉంటుందని సూచించారు. కారులో ప్రయాణించేవారు కూడా సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాల న్నారు. ఆటో డ్రైవర్‌లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించకూడదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులతో పీలేరు బస్టాండు కిటకిట

-మహిళా ప్రయాణికులే అధికం

పోటీపడి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్‌టిసి బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. వరుస సెలవులు పూర్తిచేసుకుని విద్యాసంస్థలకు తిరిగి వెళ్లే విద్యార్థులు, స్త్రీ శక్తి పథకం అమలుతో మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగి ఆదివారం ఆర్టీసీ బస్టాండు నిండుకుంది. సోమవారం నుంచి విద్యాసంస్థల పునః ప్రారంభం జరగనుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలు, కళాశాలల్లో వదిలి రావడానికి వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరి వచ్చారు. దీంతో ముఖ్యంగా పీలేరు నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులే అధికంగా ఉండడం గమనించదగ్గ విషయం. పీలేరు డిపో సర్వీసులతోపాటు, అటు మదనపల్లి, ఇటు రాయచోటి ఆర్‌టిసి డిపోల నుంచి వచ్చే బస్సులు కూడా అక్కడి నుంచే నిండుగా ప్రయాణికులతో వస్తుండడంతో పీలేరు, పరిసర ప్రాంతాల నుంచి తిరుపతి వైపు వెళ్లే ప్రయాణికులకు తగినన్ని ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో సమయానికి ప్రయాణం చేయలేక బస్టాండులో జనం గంటలకు నిరీక్షించక తప్పలేదు.

బస్సు కోసం వేచివున్న ప్రయాణికులు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన నాగూర్‌వలి, నాయకులు

ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

-మంత్రి 'మండిపల్లి'కి నాగూర్‌వలి వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపా లని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మదనపల్లె ఆర్‌టిసి 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి కోరారు. ఆదివారం టిడిపి నాయకులు గిరీష్‌కుమార్, టెంపర్ రాజేష్, ప్రవీణ్‌రాయల్, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో పాటు మంత్రిని నాగూర్‌వలి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా నాగూర్‌వలి మాట్లాడుతూ ఆర్‌టిసి అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచు కొని వారి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు త్వరలోనే మదనపల్లి ఆర్‌టిసి1, 2 డిపోలను సందర్శించాలని మంత్రిని ఆహ్వానించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల న్యాయపరమైన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఉచిత ప్రయాణం పథకంతో మహిళలంతా ఆనందంతో ఉన్నారని, త్వరలోనే మదనపల్లె పర్యటనకు వస్తానని మంత్రి హామీ ఇచ్చారని నాగూర్‌వలి తెలిపారు.

విశ్వనాథపురంలో పురాతన టోలాస్, పిడిబాకు లభ్యం

ప్రజాశక్తి - చాపాడు

టోలాస్, పిడి బాకు

మైదుకూరు మున్సిపాలిటి పరిధిలోని విశ్వనాథపురం గ్రామంలో పురాతన కాలం నాటి 12 టోలాస్(ఇనుప తూనిక రాయి), పిడిబాకు వెలుగు లోకి వచ్చినట్లు చరిత్ర కారుడు బొమ్మి శెట్టి రమేష్ తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ టోలాస్ అనేది భారత దేశంలో బరువును కొలవడానికి ఉపయోగించే ఒక సంప్రదాయ యూనిట్‌గా పేర్కొన్నారు. పూర్వం వస్తువులను సరిగా తూకం వేసేందుకు ఈ రకమైన బరువును ఉపయోగించేవారని తెలిపారు. దీన్ని కాస్ట్ ఐరన్‌తో తయారు చేశారని తెలిపారు. దక్షిణాసియా (బ్రిటిష్ కాలం కంటే ముందు), భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాణిజ్యంలో ఒకప్పుడు చారిత్రక ప్రాముఖ్యతను కలిగిన ప్రామాణిక కొలమానంగా ఉండేదని వివరించారు. సాధారణంగా రెండు, నాలుగు, ఎనిమిది, పది, ఇరవై టోలాస్ దొరుకుతాయని, పన్నెండు టోలాస్ అరుదైందని తెలిపారు. ఇది చారిత్రక పురాతన వాణిజ్య పద్ధతులకు సంబంధించినదని తెలిపారు. పిడిబాకు అనేది చిన్న పదునైన కత్తి. పిడిబాకును కటారి అని కూడా అంటారన్నారు. పిడికిలితో పట్టుకొని ఉపయోగించే బాకు అని, సాధారణంగా దీన్ని రక్షణ కోసం, యుద్ధాలలోను, వేట కోసం వాడే ఆయుధమని వివరించారు. ఇది ఆయా కాల సాంకేతికతను, యుద్ధ పద్ధతులను ప్రతిబింబించేలా ఉందన్నారు. ఇది పదునైన అంచుతో, ఉపరితలం గరుకుగా, మధ్యలో వెడల్పుగా కర్రకు అమర్చడానికి ఒక సాకెట్ (గూడు) ఉందన్నారు. విశ్వనాథపురం గ్రామస్తుడు మూర్తి వెంకటేష్ తన పూరి గుడిసె శుభ్రం చేస్తుండగా ఈ వస్తువులు బయల్పడ్డాయని, ఆ వివరాలను తనకు చెప్పారని తెలిపారు. మైదుకూరు ప్రాంతంలో పురాతన చరిత్రకు సంబంధించిన గని ఉందని, మరింత పరి శోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వివరించారు.

ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒసిలకు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కలసపాడు

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఒసి కుటుంబ సభ్యులకు ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు 10 ఎకరాల లోపు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబ సభ్యులకు మంజూరు చేయాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికి సమాన హక్కు కల్పించాలని రాజ్యాంగం సూచించిందన్నారు. నిరుపేదలైన ఒసి సంఘంలోని చాలామంది రెడ్లు, బ్రాహ్మణులు, కమ్మ, బలిజ, ఆర్యవైశ్య, తదితర ఎన్నో కులాలు ఒసి జాబితాలో ఉన్నాయని, వారికి ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రెడ్డి సంఘం నాయకులు అమ్మిరెడ్డి వెంకట నాగిరెడ్డి, ఎర్రగుంట్ల నాగ మోహన్‌రెడ్డి, తుమ్మల కొండారెడ్డి, గువ్వల వెంకట సుబ్బారెడ్డి, పోలక సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రమం.. అంధుల జీవితాలకు వెలుగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శ్రీవీర నారాయణస్వామి ఆశ్రమం అంధుల జీవితాల్లో వెలుగు అని పట్టణ ఎస్ఐ విష్ణు నారాయణ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని శ్రీవీర నారాయణస్వామి అంధుల ఆశ్రమంలో ఆదివారం 10వ వార్షికోత్సవం సందర్భంగా లూయీ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అంధులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మానవుని సేవయే మాధవుని సేవ, అంధుల జీవితంలో చిరు దీపమే వెలుగించూ అని సందేశమిచ్చారు. ఆశ్రమ చైర్మన్ వెంకట మహేశ్వరి మాట్లాడుతూ ఆశ్రమం అభివృద్ధికి సాయం చేసిన దాతలు, పాత్రికేయులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, సేవ సంస్థలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్య క్రమంలో మల్లికార్జునరెడ్డి, మానవతా సంస్థ కన్వీనర్ డివి కొండారెడ్డి, ఆల్లం రంగనాయకులు, నరసింహ, ఆశ్రమం నిర్వహలు అనిమెల రామమోహన్, రామదేవి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కడప అర్బన్: కడప నగరంలోని కో - ఆపరేటివ్ కాలనీలో శ్రీ సాయిబాబా అనాథ శరణాలయంలోని విద్యార్థులకు మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్.అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం వైద్యశిబిరానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ కె. నాగేంద్ర ప్రసాద్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లా డుతూ ఆరోగ్యాన్ని సంర క్షించుకుని మంచి పౌరు లుగా ఎదగాలని ఆకాం క్షించారు. అనం తరం డాక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ సేవ లను అభి నందిస్తూ ఘనంగా సన్మా నించారు. శరణాలయం అధ్యక్షులు ఎస్వి రామ్మూర్తి, కార్యదర్శి ఎం.బద్రీనాథ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సిటిఎం, నేతాజీ కాలనీకి చెందిన నజీర్ ఖాన్ (40), రైల్వే క్వార్టర్స్‌లో నివాసమున్న అమర్నాథ్ (39) సొంతపనిపై రాత్రి ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళు తుండగా, మార్గ మధ్యంలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ వద్ద ముందు వెళు తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నారు. అనంతరం ఎదురుగా వస్తున్న కారు ను ఢీకొని కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలోని నజీర్ ఖాన్, అమర్నాద ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా అస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.